


సాం

సూర్యుడు
స్మశానం
ఇళ్ళు. ఎ
ఊళ్ళో.

చీకటి పడి
బయటికి ర
దుప్పట్లు
టారు.
టకి తా
లేదు

# ముఖే ముఖే ఎదురైతే!

స్వరూప్ సిన్హా

తూరుపు ఇంకా తెల్లవారలేదు. అటు శీతాకాలమూ, వేసవీ కాని వాతావరణం. కొంత చలిగానూ, మరికొంత వెచ్చగానూ ఉండి నడుస్తూ వెళుతున్న నాలాటి వారి ప్రాణాలకి హాయిని గొలుపుతూ ఉంది. ఈ సిటీలో అందరూ చాలా హడావిడిగా మార్నింగ్ వాక్‌కు వస్తూ అంతా హడావుడిగా ఎవరో తరుముకువస్తున్నట్టు వారి వారి ఇళ్ళవైపు పరుగులు పెడుతూ ఉంటారు. ఎవరో, ఒకళ్ళిద్దరు నా బోటి ప్రకృతి ప్రియులు మాత్రం ఈ ప్రకృతిలోని అందాల్ని నిదానంగా ఆస్వాదిస్తూ, అక్కడక్కడా ఆగి విరబూసే పూలపై నిలిచిన మంచు బిందువులనూ, సూర్యుడి తొలి కిరణాల్లో బంగారు చినుకుల్లా మెరిసే వాటి అందాలనూ తనివితీరా చూస్తూ చిన్న మజిలీలు చేస్తూ అరగంట నడకను గంటంబావుకు పొడిగిస్తూ ఉంటారు.

ఇలా స్వగతంతో నేను నడుస్తూ చెట్ల కొమ్మల్లోంచి సూర్యుడి లేత కిరణాల్లో పడి నెమ్మదిగా కదుల్తో వస్తున్న పొగమంచునే తదేకంగా చూస్తూ అలా నిలుచుండి పోయాను.

అంతలో వినిపించింది ఎన్నో ఏళ్ళకు మళ్ళీ ఆ సుపరిచితమైన కంఠం.

"ఏమోయ్ సూర్యం! కాస్త ఇటు చూడరా బాబూ...!" సందేహం లేదు పొగమంచులో శాల్తీ కొద్దిగా మసగ్గా కనిపిస్తున్నా అది మా సుధాకర్‌దే!


'వీడేమిటి? మా ఊర్లో దిగబడడమేమిటి?' అని ఆశ్చర్యపోతూ ఆశ్చర్యం నుంచి తేరుకునే లోపలే మా వాడు ఒక్క లాంగ్ జంప్‌తో నన్ను సమీపించి కొద్దిగా వగరుస్తూ అమాంతం నన్ను వాటేసుకున్నాడు. "ఎన్నాళ్ళకెన్నాళ్ళకు మిత్రమా?" అంటూ సుమారు ఇరవై యేళ్ళ తర్వాత కనిపించిన మిత్రుడి భుజాల చుట్టూ చేతులు బిగిస్తూ తేరుకుని పలకరించాను.

"అదేమిట్రా సుధా! ఇలా తెల్లారక ముందే ఆకాశం నుండి ఊడిపడ్డావు. అసలీ ఊరెప్పుడొచ్చావు? నీ కథా కమామీషేమిటి?" అన్నాను సంతోషంగా.

వాడింకా వగరు స్తూనే ఉన్నాడు.

"ఆపరా బాబూ! ప్రశ్నలతో చావగొట్టకు. ముందలా వెళ్ళి కాఫీ తాగుతూ మాట్లాడు కుందాం పద..." అంటూ చెయ్యి పట్టుకుని 'ఇండియన కాఫీ హౌస్'కు లాక్కెళ్ళి నన్ను కూలేశాడు. ఇంకా నిద్రమత్తులో దంతధావనాన్ని కానిస్తూ మా వైపు విసుగ్గా చూస్తున్న ప్రొప్రయిటర్‌కు రెండు కాఫీ ఆర్డరిచ్చాడు.

"మనుషుల్లో భావుకత బొత్తిగా చచ్చిపోయిం దిరా సుధా. సపోజ్ నేనే ఈ హోటల్ ప్రొప్రయిటర్‌ని అనుకో ఇలా పొద్దున్నే



ఎవరైనా అనుకోని అతిథి వస్తే సంతోషంగా ఎగిరి గంతేసి కృష్ణశాస్త్రి గారి గీతం అందుకుని చక్కటి ఫిల్టర్ కాఫీ తయారుచేసి ఇచ్చేవాణ్ణి అన్నాను. "రాకోయీ అనుకోని అతిథీ...' కూని రాగం తీస్తూ.

"ఒరే సూర్యం యాభయ్యో పడిలో పడ్డా నువ్వప్పటి లాగానే ఉన్నావురా. నీలో ఏ మార్పూ లేదు. అదృష్టవంతుడివి" అన్నాడు సుధా నా వైపు చూసి నవ్వుతూ.

"మనమెందుకు మారతామోయ్! మన చుట్టూ ఉండే పరిస్థితులు మారతాయ్. అంతే!" అన్నాను.

గొంతు బిగ్గరగా సవరించుకుని "ఒరేయ్ బాబూ! బుద్ది గడ్డి తిని నిన్ను కదిలించాను. నువ్వు రచయితవవ్వడం ఆంధ్రుల పాలిట వరమో శాపమో నాకైతే తెలీదు. కాఫీ చుక్క గొంతులో పడకపోతే మాత్రం నీ ఊకదంపుడు వింటూ దబ్బున కళ్ళు తిరిగి పడిపోతాను. మా ఇంటికి చేర్చాలన్నా నీకు అడ్రసు కూడా తెలదాయె" అన్నాడు సీరియస్‌గా.

"సారీరా సుధా! నా భావుకతలో పడిపోయి నీ గురించి అడగడమే మర్చిపోయాను. ఇప్పుడు చెప్పు నీ గురించి..." నాయర్ తెచ్చిన కాఫీ గ్లాసు అందుకుంటూ చెప్పాను.

"అదీ... అలాఅడిగావు బాగుంది. నేనప్పుడు స్టేట్స్‌కు వెళ్ళానా? మళ్ళీ ఈ మిలీనియంలోనే అక్కణ్నుంచి మన దేశం వచ్చేశాం!"

ఆశ్చర్యపోయాన్నేను. "అదేం... అక్కడే సెటిలయ్యావనుకున్నాం"

"అవుదామనే అనుకున్నా. కానీ ఇక్కడ పెట్టిన టెక్స్‌టైల్స్ బిజినెస్ మంచి లాభాలను తెచ్చిపెట్టింది. ఇక్కడే ఉండిపోయాం. ఈ ఊర్లో ఓ ఇల్లు కూడా కొన్నాం. అన్నట్టు మా ఇంటికి వెళదాం రారా బాబూ!" అన్నాడు నా చెయిన్

> ## మీరే చెప్పాలి
> మమ్మల్ని
> ఖండఖండాలుగా పీక్కుతిన్నాకా...
> తెలుగు సినిమా
> వడి సంద్రం'లో నావలా' ముంచేశాకా...
> ఎంచక్కా మీరు వెళ్ళి
> 'ఖండాలా'లోనో, ఏ 'లోనోవాలా'లోనో
> డ్యూయెట్లు పాడుకుంటే
> మాకేం లాభం చెప్పండి!
> మై డియర్ హీరో హీరోయిన్స్?
>
> \- భమిడిపాటి వెంకటేశ్వరరావు

లాగుతూ.

"ఇలా నేను ఉన్న పళంగా మార్నింగ్ వాక్ నుండి మాయమవుతే మీ చెల్లెలేమనుకోవాలి? ఎవరో కిడ్నాప్ చేశారనుకుంటుంది".

"ఎంతసేపులేరా సూర్యం. ఓ అరగంటలో మళ్ళీ మీ ఇంటి దగ్గర దిఆబెట్టేస్తాను. కావాలంటే మా ఇంటి నుంచి ఫోన్ చేద్దువుగానీ... పద పద... కారెక్కు..." అన్నాడు తొందరచేస్తూ.

"మార్నింగ్ వాక్‌కు కార్లో రావడమేమిట్రా బాబూ" అన్నాను బిత్తరపోతూ.

"ఇంకా నయం. నేనేమన్నా అథ్లెట్‌నటరా... నిజంగా ఎక్సర్‌సైజు చెయ్యడానికి? ఏదో అలా స్టయిల్‌గా ఉంటుందని కారాపి కొ,త దూరం నడుస్తాను. అక్కడికే ఆయాసం వస్తుంది" ఆరును ముందుకు దూకిస్తూ అన్నాడు.

నేను చిరునవ్వుతో సుధా వైపు చూశాను. చెంపల దగ&గర జుట్టు కాస్త నెరిసింది. కానీ మనిషి బాగా రంగు తేలాడు. అమెరికా నీళ్ళు బాగా వంటబట్టినట్టున్నాయి.

అయిదో క్లాసులో నాతో పాటు ఒకే బెంచీలో కూర్చుని ఒకే చెట్టు కింద క్యారేజీలో అన్నం తిని తుంగభద్ర ఒడ్డున ఇసుకలో నాతో పాటు ఆడుకునే నా చిన్ననాటి నేస్తం సుధాకరే కనిపిస్తున్నాడు.

"అయ్యా రచయిత గారూ... మళ్ళీ మీ లోకంలోకి పోయారా..." అన్నాడు వాడు విసుగ్గా.

నేను తేరుకుని చెప్పాను "అది కాదురా సుధా మన చిన్నప్పటి రోజులు గుర్తొచ్చి ఆలోచనలో పడిపోయాను" అన్నాను.

వాడూ చిరునవ్వు నవ్వాడు. "నిజమేరా సూర్యం "అవి మన జీవితంలో అపురూపమైన రోజులు. మన బాల్యస్మృతులను మన పిల్లల్లో చూసి సంతోషపడే అదృష్టం మాకు లేదు" అన్నాడు కళ్ళు చెమరుస్తూంటే.

"అదేంరా అలా అంటావు. మన శశాంక చెప్పాడు నీకిద్దరు పిల్లలని. వాళ్ళు చదువులు పూర్తయి ఈ పాటికి ఉద్యోగాల్లో ఉండి ఉండాలే!"

"ఉన్నారు బాబూ. అక్కడే స్టేట్స్‌లోనే ఉన్నారు. మాతో పాటు ససేమిరా రామన్నారు. నెలకు ఐదు లక్షలు వదులుకుని ఈ బోడి ఇరవై వేల కోసం ఇండియా రావాలా అంటారు నా ఇద్దరు కొడుకులూ!" నిట్టూర్చాను నేను. రానురాను మనుషుల మధ్య ఆప్యాయతలూ అనుబంధాలకు బదులు ఆర్థిక ఒప్పందాలు ప్రాధాన్యతను పొందడం నాకు చాలా బాధ అనిపించింది. సుధ కూడా చాలా సేపటి తరువాత తేరుకుని అన్నాడు...

"అద్సరే గానీ మన శశాంక సంగతేమిటి? నువ్వు ఇందాక వాడిపేరు చెబితే గుర్తొచ్చింది" అన్నాడు.


"మనవాడు ఇక్కడే నిక్షేపంగా ఇల్లు కట్టుకుని సెటిలయ్యాడు. మొన్నీమధ్యే వాళ్ళమ్మాయి ఎమ్.ఏ. పూర్తి చేసి రిసెర్చిలో చేరింది" చెప్పాను.

"ఇంకా ఈ కాలంలో కూడా ఎమ్.ఏ.లు, ఎమ్.ఎస్.సి.లు ఏమిట్రా? వాడు పిల్లల్ని ప్రొఫెషనల్ కోర్సుల్లో చేర్చలేదా?" అడిగాడు.


"ఒరే... అలా అనకురా. మన శశాంకకు చిన్నప్పటి నుంచీ సాహిత్యమంటే మక్కువని నీకు తెలుసు గదా! వాడు వాళ్ళిద్దరమ్మాయిలనూ సాహిత్యంలో డాక్టర్లని చెయ్యాలని ఇష్టపడుతున్నాడు..."

"సరేలే... నేను వాణ్ణేమీ అననుగానీ, కాలంతో పాటు మనమూ మారొద్దూ... ఇంతకూ వాడింకా సాహిత్యమూ, సంగీతమూ అంటూ టైమ్ వేస్టు చేస్తున్నాడా లేక డబ్బు సంపాదనేమైనా ఉందా?"

నేను మౌనంగా ఉండిపోయాను. కళను ఆస్వాదించలేని బ్రతుకు వ్యర్థ అనేది శశాంక సిద్ధాంతం. అన్ని వేళల్లోనూ మనిషికి తోడుగా



# గవర్నమెంట్ బాండ్స్



ఇటీవల బ్యాంకులలో వడ్డీ విపరీతంగా పడిపోయింది. బ్యాంకువారి వద్ద ధనం అతిగా మూలుగుతుండటంతో వారు భారీగా రుణాలను మంజూరు చేస్తున్నారు. కానీ, డబ్బు దాచుకోవాలనుకునేవారికి మాత్రం వడ్డీలు తగ్గిపోవడంతో ఉన్న ధనాన్ని ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు. అలాంటి వారు గవర్నమెంట్ బాండ్స్‌ను కొనుగోలు చెయ్యవచ్చు. వీటిపై టాక్స్ రిబేటు కూడా ఉండటంతోపాటు, వడ్డీ కూడా బ్యాంకుల కంటే కాస్తంత ఎక్కువ లభిస్తుంది. రూ.1000/- నుంచి సైతం ఈ బ్యాండ్స్ అందుబాటులో ఉన్నాయి. అలాగే కంపెనీ డిపాజిట్స్ ద్వారా కూడా ఎక్కువ మొత్తాన్ని వడ్డీగా పొందవచ్చు.

కొద్ది మొత్తాన్ని డిపాజిట్ చెయాలనుకునేవారికి రికరింగ్ డిపాజిట్స్, కిసాన్ వికాస పత్రాలు, మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్స్, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్స్ వంటివి బాగా ఉపయోగపడతాయి. అదేవిధంగా పోస్టల్ డిపాజిట్స్‌లో కూడా మీ సొమ్మును భద్రపరుచు కొనవచ్చు.

- ఎస్.ఎల్.బి

ఉండేవి కళలేగానీ డబ్బూ, హోదా కాదంటాడు. వాడలాగే జీవిస్తున్నాడు కూడాను...

ఆలోచనల్లో ఉండగానే సుధాకర్ వాళ్ళ ఇల్లు వచ్చేసింది. అది ఇల్లు కాదు. మైసూరు మహారాజు కోటకు కాస్త అటూ ఇటూగా ఉంది.

"ఒరేయ్! సుధా... ఉండేది నువ్వూ మా చెల్లాయే అంటున్నావు. ఈ లంకంత కొంప నీకెందుకురాః..." అన్నాను ఆశ్చర్యపోతూ.

"ఇది స్టేటస్ సింబలోయ్... అయినా నీకు నేను చెప్పాలా ఏమిటి?" అన్నాడు నా చెయ్యి పుచ్చుకుని లోపలికి లాక్కెళుతూ.

ఆ ఇంటిని ఆశ్చర్యంగా గమనిస్తూ లోపలికి నడిచాను. మా సుధాకు నీళ్ళంటే చచ్చేంత భయం. అయినా ఇంటి ముందే పెద్ద స్విమ్మింగ్ పూల్ చూస్తే నాకు నవ్వొచ్చింది.

"ఇదిగోనోయ్. రాక రాక మా సూర్యం వచ్చాడు. కాస్త టిఫినూ అదీ ఏర్పాటు చెయ్యి" ఒక్క కేకతో భార్యను పురమాయించి ఇల్లంతా తిప్పి నన్ను చివరికి డ్రాయింగ్ రూమ్‌లో కూలేశాడు.

మా చెల్లాయి కూడా సుధా స్టేటస్‌కు తగినట్లుగా గొప్పగానే కనిపించింది. పరస్పరం పలకరింపులూ, కుశల ప్రశ్నలూ అయ్యాక ఆమె లోపలికి వెళ్ళిపోయింది. ఓ పదిమంది నౌకర్లూ, చాకర్లూ అటూ ఇటూ పరుగెత్తుతూ పనులు చేస్తున్నారు. మాటవరసకి టిఫిన్ అన్నారు గానీ అది టిఫినా... ఊహు ... మొగలాయి చక్రవర్తుల డిన్నర్‌లా అనిపించింది.

వారిని మా ఇంటికోసారి రమ్మని ఆహ్వానించి వచ్చేస్తుంటే గుర్తొచ్చింది శశాంక ఇప్పుడో సొంతిల్లు కట్టుకున్నాడనీ, అది ఈ ప్రాంతాల్లోనే ఎక్కడో ఉందనీ, అదే విషయాన్ని సుధాకు చెప్పాను.

"పనిలో పని రాకూడదూ... మరో చిన్న నాటి మిత్రుణ్ణి కూడా చూసినట్టు ఉంటుందని పిలిచాను. దానికి వాడిచ్చిన సమాధానం విని నివ్వెరపోయాను.

"నువ్వంటే ఓ.కే.రా! ఆ శశాంక గాడి పద్ధతి నాకు సరిపోదు. పైగా వాడి స్టేటస్ ఎక్కడ? మన స్టేటస్ ఎక్కడ ... కుదర్దులే..." అన్నాడు నిర్లక్ష్యంగా.

"భగవంతుడా సృష్టిలో తీయనిది డబ్బే గానీ స్నేహం కాదా?", సుధాకర్‌ను చూశానన్న సంతోషం కంటే నాకు బాధే ఎక్కువ మిగిలింది. వాడు కారులో దిగబెడతానన్నా నేను వినిపించుకోలేదు. సెలవు తీసుకుని శశాంక ఇంటిని వెతుక్కుంటూ బయలుదేరాను. అంత గొప్ప 'పేలస్'లోనూ నాకేదో వెలితి కనిపించింది. అలా ఎందుకనిపించిందో ఎంత ఆలోచించినా అర్థం కాలేదు.

శశాంక ఇంటిని నేమ్‌బోర్డు సహాయంతో కనుక్కుని తలుపు తట్టాను. తలుపు తీసిన శశాంక నన్ను చూసి సంభ్రమాశ్చర్యాలతో ఎగిరి గంతేసినంత పని చేశాడు.

"పట్టపగలే చందమామ మా ఇంటికి నడిచి వచ్చాడేమిటా అని ఆశ్చర్యపోయాను. వెల్‌కం మై ఫ్రెండ్. ఇవ్వాళ నిజంగా ఎంత సుదినం? ఇదిగో సరళా మా సూర్యం వచ్చాడు చూడు..."


"ఎన్నాళ్ళయిందిరా నిన్ను చూసి... ఏం తీసుకుంటారు? అన్నట్టు నువ్వు "టీ ప్రియుడివి కదూ! ఉండు. నీ కోసం స్పెషల్ టీ తయారు చేయిస్తాను. పద నా గదిలో కూర్చుని మాట్లాడుకుందాం" భుజం మీద చేయి వేసి ఆప్యాయంగా నడిపించుకుంటూ వెళ్ళాడు.

అంతవరకూ నేను శశాంక ఇంటిని పరిశీలించలేదు. ఇల్లంతా కలిపితే ముచ్చటగా మూడే గదులు. ముందు గది డ్రాయింగ్ రూమ్, దానికి చెరోవైపూ శశాంక గది, పిల్లల గదీ చిన్న కిచెన్... ఇల్లు చాలా 'సింపుల్'గా ఉన్నప్పటికీ నాకెందుకో ఆ ఇంట్లోకి ప్రవేశించగానే చాలా సంతృప్తిగా అనిపించింది.

"పిల్లలేరీ... కనిపించరే...!" అన్నాను చుట్టూ చూస్తూ.

"నీ కోడళ్ళిద్దరూ పి.హెచ్.డి.ల పడి సాహితీ సంద్రాన్ని ఒక్క గుక్కలో లాగెయ్యాలని నిరంతరం శ్రమిస్తూ చదువుతూ ఉంటారు. వాళ్ళకు ఈ లోకం పట్టదు. ఒకళ్ళు కీట్సు, షేక్స్‌పియర్‌లను ఔపోసన పడితే మరొకళ్ళు నన్నయ్యను, దేవులపల్లినీ ఆమూలాగ్రం చదవాలని తపన పడుతుంటారు. యూనివర్శిటీ లైబ్రరీలో ఉంటారీపాటికి" నవ్వుతూ చెప్పాడు.

"అంతా తండ్రి పోలికేనన్న మాట..." నవ్వాను నేను.



"నా పోలిక కూడా నన్నయ్యా... నన్ను మర్చిపోయారు మీరు" ట్రేలో రెండు టీ కప్పులతో వస్తూ చెప్పింది సరళ.

"అవునవును... మర్చిపోయానమ్మా... నా రచనలను చదివి ఎప్పటికప్పుడు వాటిలోని మంచి విశ్లేషించేది నువ్వేనన్న సంగతి మర్చిపోయాను" ఒప్పుకున్నాన్నేను.

"మొత్తంమీద మీది సాహితీ కుటుంబంరా..." అన్నాన్నేను సంతోషపడుతూ.

"మరి నీలాటి రచయిత ఫ్రెండునైతే ఆ మాత్రం సాహితీ గంధం నాకు అంటాలిగదా" నవ్వుతూ చెప్పి....

"ఇక్కడ కూర్చుని పుస్తకాలూ అవీ చూస్తూ ఉండు. కొత్త కథలేవన్నా రాశావా? నేనో 'హాఫ్ డే' లీవ్ పెట్టి వస్తాను. నువ్వొస్తే మాకు పండగే మరి. నీ పుస్తకాలు సెపరేట్ బీరువాలో పెట్టాను చూడు." అంటూ వెళ్ళాడు. సరళ కూడా కొంతసేపు ఆ ఆమాటా ఈ మాటా మాట్లాడి లోపలికి వెళ్ళింది.

గది పరికించి చూశాను. చాలా నిరాడంబరంగా ఉన్నా చాలా గొప్పగా అనిపించింది నాకు. నిజానికి ఈ ఇల్లే అసలైన 'ప్యాలెస్' లా తోచింది. నాలుగు గోడలకూ నాలుగు బీరువాలు. వాటి అద్దాల తలుపుల్లోంచి మిల్టన్, షేక్స్‌పియర్, వర్డ్స్‌వర్త్, డికెన్స్, బ్రాంటీ, హెయిలీ, ఒక వైపు నుండీ... కవిత్రయము గురజాడ, ఉన్నవ, బాపిరాజు, విశ్వనాథ, మధురాంతకం, యద్దనపూడి మరో వైపు నుండీ తొంగిచూస్తూ నన్ను పలకరిస్తున్నారు. చిరునవ్వులు చిందిస్తున్నారు.

ఆ గదిలో ఎంతో ప్రశాంతంగా అనిపించి కళ్ళు మూసుకుని ఈజీ ఛెయిర్‌లో వెనక్కి వాలాను. అదే గదిలో ట్యూన్ చేసిన రేడియో లోంచి 'ద్వారం' వారి వాయులీనం 'రఘువంశ సుధాంబుధి' అంటూ అద్భుతమైన సంగతులు పలికిస్తోంది.

సుధాకర్ ఇంట్లోని వెలితికి ఇప్పుడు కారణం తెలిసింది నాకు. అంత పెద్ద రాజదర్బారులో కనీసం ఒక్కటంటే ఒక్క పుస్తకమైనా కనిపించలేదు.

"ఒరే సుధా మనం కాలేజీ చదివే రోజుల్లో కొనుక్కున్న పుస్తకాలేవిరా?" అని అడిగాడు పొద్దున్న.

"ఇంకెక్కడి పుస్తకాలురా బాబూ. ఎప్పుడో అమ్మి పడేశాను" అన్నాడు నిర్లక్ష్యంగా. నాకు కంట్లో నీకు తిరిగింది. వాటిలో చాలామట్టుకు నేను వాడికి బహుమతులుగా ఇచ్చినవే. అందులో నేను రాసినవే సుమారుగా ఉన్నాయి.

"అదేమిట్రా... నీకూ ఎంతో కొంత పఠానాసక్తి ఉండేదిగా అన్నాను ఏమనాలో తెలీక.

"ఈ మిలీనియంలో పుస్తకాలు చదివే వెధవెవడ్రా... అందులో ఇంటర్‌నెట్, ఈ-మెయిల్ లాటివి వచ్చాక కూడానా" నన్నో పురుగును చూసినట్టు చూశాడు వాడు.

హాయిని గొలిపే సంగీతం వింటూ ఆలోచనల్లో ఓ విధమైన నిద్రావస్థలోకి జారుకుని నెమ్మదిగా గది మధ్యలోకి దృష్టి సారించాను. అక్కడ ఉన్నతాసనంపై ఆసీనురాలైన సరస్వతీ దేవి చిరునవ్వులు చిందిస్తూ ధవళ వస్త్రాలు ధరించి, తన చల్లని చూపులతో నన్నూ ఆ ఇంటినీ ఆశీర్వదిస్తూన్నట్లుగా అనిపించింది. అలాగే అబ్బురపడి చూస్తూ ఉన్నాను. ఆమె మృదుమధురమైన గళం విప్పి పలికింది.

"ఇది మీ అబ్బాయి ఇల్లు... ఇక్కడ నేను సంతోషంగా ఉన్నాను." ఆ చల్లని తల్లి నాకు చెప్తూ ఉంది.

"అదేమిటి మామయ్యా... పట్టపగలే కలలు కంటున్నారు..."


"అబ్బే కలలు కాదే... మన సూర్యం మామయ్య కొత్త కథకి ప్లాటునాలోచిస్తున్నారు... కదా... మామయ్యా..."

శశాంక కూతుర్ల నవ్వులతో ఈ లోకంలోకి వచ్చి పడ్డాను. ఇప్పుడు నా మిత్రుడు శశాంక ఈ ప్రపంచంలోకెల్లా ధనవంతుడిలా తోచాడు నాకు.

❋

## గజాలా ఎక్కడ?

గజగామిని గజాలా ఏం చేస్తున్నట్లు? 'జానకి వెడ్స్ శ్రీరాం' సినిమా తరువాత. గజాలాకి సినిమాలే లేకుండా పోయాయి. వెంకటేష్ హీరోగా చేస్తున్న సినిమాలో అవకాశం వచ్చినా, కేవలం సింగిల్ పాటకే పరిమితమయింది గజాలా. తరువాత ఆమెకి ఏమీ సినిమాలు లేవని టాలీవుడ్ బోగట్టా. నటిగానూ,ఎక్స్‌పోజింగ్‌తోనూ ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్న ఈ కోమలాంగికి సినిమాలేవీ లేకపోవడానికి కారణమేంటని టాలీవుడ్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి.





## కత్రీనా, సల్మాన్‌ఖాన్‌ల షికార్లు!

కత్తిలాంటి ఫిగర్ కత్రీనాకైఫ్, కండల వీరుడు సల్మాన్‌ఖాన్ ముంబాయిలో షికార్లు చేస్తూ బిజీగా ఉన్నారట. కోర్టుల చుట్టూ తిరగడం సరిపోలేదేమో, సల్మాన్‌ఖాన్ కత్రీనాను వెంటేసుకుని అదే పనిగా షికార్లు చేస్తున్నాడని పుకార్లు కూడా షికారు చేస్తున్నాయి. అయితే కత్రీనాకు సల్మాన్ గత ప్రేమికురాళ్ళ సంగతి తెలుసో లేదో? అన్నదే సందేహం! తెలియకపోతే ఆయనగారి చేతిలో తన్నులు తినడం ఈసారి కత్రీనా వంతవుతుందేమో!